www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 మే 2023
5
ఏలూరు



నేడు యధావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల ఎనిమిదో తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతికదూరం పాటించాలని కోరారు.

కౌలు రైతుకు.. భరోసా కరువు..!




- సాగు ఇబ్బందులు, పంట నష్టాలతో అన్నదాత విలవిల
- వరి, మామిడి రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులకు పాట్లే
- కౌలురైతులకు దక్కని ప్రభుత్వ సాయం
- బ్యాంకురుణాలు, పంటనష్టం సైతం భూయజమానుల ఖాతాల్లోకే
- దిక్కుతోచని స్థితిలో ఉమ్మడి జిల్లాలో 3 లక్షల మంది కౌలురైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగు ఇబ్బందులు, వరుస పంట నష్టాలతో కౌలురైతులు విలవిల్లాడిపోతున్నారు. ప్రభుత్వం నుంచి భరోసా దక్కకపోవడంతో వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పుల బాధతో నిత్యం నరకం అనుభవిస్తున్న పరిస్థితి నెలకొంది. బ్యాంకులు అందించే పంట రుణాలు, ప్రభుత్వం అందించే పంట సాయం, బీమా వంటివి సైతం సాగు చేసే కౌలురైతులకు అందడం లేదు. సాగుకు దూరంగా ఉంటున్న భూయజమాని ఖాతాల్లోకే ప్రభుత్వ సాయం 90 శాతం చేరిపోతుంది. జిల్లాలో ప్రధానమైన పంట సాగుచేసే వరి రైతుల పరిస్థితి అత్యంత దారుణంగా మారగా, మామిడిరైతులు సైతం తీవ్ర నష్టాలను మూటగట్టుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. జిల్లాలో దాదాపు 16 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతుండగా జిల్లా సాగులో 75 శాతం కౌలురైతులే చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాలకు రూ.వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రణాళికలు రూపొందిస్తున్న కౌలురైతులకు ఒక్క శాతం రుణం కూడా అందని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లాలో కౌలురైతులకు బ్యాంకుల నుంచి అందిన పంట రుణాలు దాదాపు రూ.50 కోట్లు మాత్రమే. పశ్చిమలోనూ కౌలురైతులకు పెద్దగా రుణాలివ్వని పరిస్థితి ఉంది. ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పు తెచ్చి కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. పంట దెబ్బతిన్నా తెచ్చిన అప్పులు వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సాయం అందడం లేదు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతుభరోసా సొమ్ము సైతం వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందడం లేదు.

ప్రభుత్వానికి పట్టని కౌలురైతుల గోడు

కౌలురైతుల గోడు ఏ ప్రభుత్వానికీ పట్టడం లేదు. ఎన్నికల ముందు కౌలురైతులను ఆదుకుంటామని హామీలు గుప్పించడం మినహా ఆచరణలో మాత్రం ఏమీ లేకుండా పోతుంది. 2019లో వైసిపి ప్రభుత్వం కౌలురైతుల కోసం తెచ్చిన చట్టం రైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతో కౌలుకార్డు ఇవ్వాలని నిబంధన పెట్టడంతో కౌలురైతులకు కౌలుకార్డు కూడా అందని పరిస్థితి నెలకొంది. దీంతో ధాన్యం అమ్ముకునేందుకు సైతం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతియేటా ఖరీఫ్‌లో పెద్దఎత్తున పంటలు దెబ్బతింటున్నా కౌలురైతులకు మాత్రం సాయం అందడం లేదు. బీమా సైతం భూయజమాని ఖాతాల్లోకే వెళ్లిపోతుంది. గడిచిన రెండేళ్లుగా వరి సాగులో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. సంచుల్లేక, లారీలు సకాలంలో రాక ధాన్యం అమ్ముకునేందుకు రైతులకు నరకం చూస్తున్నారు. ప్రస్తుత రబీలో ఒకపక్క వర్షాలు, మరోపక్క ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలివానలకు మామిడి కాయలు రాలిపోయి రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. మామిడి సాగులోనూ అత్యధికంగా కౌలురైతులే ఉన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితికి రైతులు చేరుకున్నారు. సాగు చేసే కౌలురైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు కౌలురైతులకు న్యాయం చేసేవిధంగా చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితులు దారుణంగా మారే ప్రమాదం కనిపిస్తోంది.



మిల్లర్లు, సిబ్బందితో మాట్లాడుతున్న శశిభూషణ్‌కుమార్

నూక శాతం పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

- తీరు మారకపోతే మిల్లర్లపై చర్యలు
- ధాన్యం కొనుగోళ్లు జిల్లా పర్యవేక్షణాధికారి శశిభూషణ్‌కుమార్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నూక శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ధాన్యం సేకరణలో రైతులను ఇబ్బంది పెట్టే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర జలవనరుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, ధాన్యం కొనుగోళ్ల జిల్లా పర్యవేక్షణాధికారి శశిభూషణ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఉంగుటూరు ఆర్‌బికె, నాచుగుంట రైస్‌మిల్లులను సందర్శించారు. రైతులు, ఆర్‌బికె సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తేమ, నూకల శాతం కొలిచిన తరువాత ధాన్యాన్ని రైసుమిల్లుకు తరలించాక మిల్లర్లు తమకు పలుమార్లు ఫోన్ చేసి ధాన్యం కొనుగోలు విషయంలో పలు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రవాణాలో లారీ డ్రైవర్లు అధిక మొత్తం డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై శశిభూషణ్‌కుమార్ స్పందిస్తూ ధాన్యం రవాణాకు ట్రక్ షీట్ రూపొందించాక ధాన్యాన్ని రైస్‌మిల్లుకు పంపి దిగుమతి చేయించాల్సిన బాధ్యత కస్టోడియన్ అధికారిదని, దీనిలో రైతులకు ఎటువంటి ప్రమేయమూ ఉండదని స్పష్టం చేశారు. ఆర్‌బికె అధికారులకు ధాన్యం అందించాక సొమ్ము 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. అధికారులు సమన్వయంతో పని చేస్తే ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవన్నారు. రవాణా ఛార్జీలను జిల్లాస్థాయిలో లారీ యజమానులతో చర్చించి నిర్ణయించారని, లారీ డ్రైవర్లకు కూడా అధిక మొత్తం చెల్లించనవసరం లేదని, ఏ లారీ డ్రైవర్ అయినా ఇబ్బంది పెడితే వెంటనే దగ్గరలోని అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. కొన్ని కేంద్రాల్లో ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తయినప్పటికీ మళ్లీ లక్ష్యాన్ని సవరించి ధాన్యం సేకరణ చేస్తున్నామన్నారు. తడిచి రంగుమారిన ధాన్యంను కూడా రైతుల నుండి కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ రూ.240 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుండి సేకరించామన్నారు. నాచుగుంట గాయత్రి ట్రేడర్స్ రైస్‌మిల్లులో నూక శాతం విధానంపై సమీక్షించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ పోతురాజు, మండల వ్యవసాయాధికారి రామకృష్ణ, జిల్లా అధికారులు ఉన్నారు.



పరీక్ష రాయాలంటే జడ విప్పాల్సిందే..





చెవి రింగులు, మెడలో గొలుసులు తీసేస్తున్న విద్యార్థినులు

ప్రశాంతంగా నీట్

ఏలూరులోని మూడు కేంద్రాల్లో 1329 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నేషనల్ ఎంట్రన్స్ కం ఎలిజిబిలిటీ టెస్ట్ (నీట్) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఏలూరులోని మూడు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని నీట్ ఏలూరు సిటీ కోఆర్డినేటర్ పి.సాయికుమారి శంకర్ తెలిపారు. సిఆర్‌రెడ్డి అటానమస్ కళాశాలలో మొత్తం 504 మందికి 497 మంది హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్లో మొత్తం 463 మందికి 455 మంది హాజరయ్యారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో 384 మందికి 377 మంది హాజరయ్యారు. మొత్తం మూడు కేంద్రాల్లో 1351 మందికి 1329 మంది హాజరవ్వగా 22 మంది గైర్హాజరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు విద్యార్థులను పరీక్ష హాల్లోకి అనుమతించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఈ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ వాచీలతోపాటు, సాధారణ వాచీలు, ఉంగరాలు, కాళ్ల పట్టీలు, చెవి దిద్దులు, ముక్కుపుడకలు, కాళ్లు, చేతులకు కట్టుకునే దారాలతో సహా వేటినీ అనుమతించలేదు. చివరకు విద్యార్థినులు జడకు పెట్టుకునే రబ్బర్ బ్యాండ్‌తో సహా తీయించి పరీక్ష హాల్లోకి అనుమతించారు. జడ వేసుకొచ్చిన విద్యార్థులను కూడా జడ తీయించి తల వదులుకోవాలని చెప్పి పరీక్ష హాల్లోకి అనుమతించారు. దీంతో చాలామంది విద్యార్థులు మెడలోని గొలుసులు, చెవి దిద్దులు, ముక్కుపుడకలు వంటివి తీసి వారి తల్లిదండ్రులకు ఇచ్చి పంపించారు. కొంతమంది ముస్లిం విద్యార్థినులు బురఖాలతో రాగా ముందుగా వారిని పరీక్ష హాల్లోకి అనుమతించలేదు. అయితే మతపరమైన సంప్రదాయ దుస్తులు ధరించవచ్చని నిబంధనలో ఉందని తల్లిదండ్రులు వాదించటంతో చివరికి వారిని అనుమతించారు. మొత్తానికి నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది.



బుర్కా ధరించడంపై అభ్యంతరం తెలుపుతున్న సిబ్బంది

సూక్ష్మసేద్యం లక్ష్యం నీటి ఆదా

మైక్రో ఇరిగేషన్ పీడీ పివిఎస్.రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్





సూక్ష్మసేద్యం లక్ష్యం నీటి ఆదా అని, గత సంవత్సరం 4657 హెక్టార్లు సూక్ష్మ సేద్యం పరిధిలోకి తీసుకొచ్చామని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పివిఎస్.రవికుమార్ తెలిపారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ లక్ష్యాలు ఏమిటీ, ఏ ఏ పంటలకు బిందు సేద్యం ఉపయోగిస్తారు, ఏ ఏ పంటలకు తుంపర సేద్యం ఉపయోగిస్తారు.. ఈ సంవత్సరం టార్గెట్ ఎంత వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న: సూక్ష్మసేద్యం వల్ల ఉపయోగాలు ఏమిటి?

సూక్ష్మ సేద్యం ముఖ్య లక్ష్యం నీటిని ఆదా చేయడం. రోజురోజుకీ భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుతూ అధిక దిగుబడి పొందడమే కాక పంట నాణ్యత, రైతుకు ఖర్చు తగ్గింపు వంటి ఉపయోగాలు సూక్ష్మసేద్యం వల్ల ఉంటాయి.

ప్రశ్న: సూక్ష్మ సేద్య పథకంలో రైతులకు ఎలాంటి సబ్సిడీ ఇస్తున్నారు?

ఈ పథకంలో బిందు సేద్యంలో ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్నకారు రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు ఎకరాలపైన ఉన్న పెద్ద రైతులకు 50 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. అలాగే తుంపర సేద్యంలో ఐదు ఎకరాల్లోపు ఉన్న చిన్న రైతులకు 55 శాతం సబ్సిడీ, ఐదు ఎకరాలపైన ఉన్న రైతులకు 45 శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది.

ప్రశ్న: ఏ ఏ పంటలకు బిందు సేద్యం ఉపయోగిస్తారు? ఏ ఏ పంటలకు తుంపర సేద్యం ఉపయోగిస్తారు?

ఒక వరుస క్రమంలో ఉన్న పంటలకు అంటే కొబ్బరి, ఆయిల్‌పామ్, జామ, బొప్పాయి, అరటి, కూరగాయలు, మొక్కజొన్న వంటి పంటలకు బిందు సేద్యం ఉపయోగిస్తారు. దీనివల్ల ప్రతి చుక్క వేరు వ్యవస్థను తాకి నీరు వృథా కాకుండా ఉంటుంది. అలాగే వరుస క్రమంలో లేని పంటలు అంటే వేరుశనగ, మినుములు, పెసలు వంటి పంటలకు తుంపర సేద్యం ఉపయోగిస్తారు.

ప్రశ్న: ఈ సంవత్సరం టార్గెట్ ఎంత? ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైందా?

ఈ సంవత్సరం ఐదు వేల హెక్టార్లు టార్గెట్‌గా నిర్ణయించడం జరిగింది. ఇంకా ఆన్‌లైన్ ప్రక్రియ మొదలవ్వలేదు.

ప్రశ్న: ఈ పథకానికి రైతు ఎలా దరఖాస్తు చేసుకోవాలి? దరఖాస్తు చేసుకున్న ఎన్ని రోజులకు పరికరాలు బిగిస్తారు?

ముందుగా రైతు రైతుభరోసా కేంద్రంలో బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. మన జిల్లాలో 14 కంపెనీలు ఈ సేవలందిస్తున్నాయి. నచ్చిన కంపెనీని రైతే ఎంచుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్నాక కంపెనీ ప్రతినిధి, రైతు భరోసా కేంద్రం ప్రతినిధి, రైతు కలిసి పొలాన్ని పరిశీలించి జిపిఎస్ సర్వే ద్వారా పొలాన్ని కొలతలు వేసి ఆపై మంజూరు చేయడం జరుగుతుంది. వెంటనే రైతు తన వాటా చెల్లించిన వెంటనే ప్రాజెక్టు అంచనా, డిజైన్ వేసి కలెక్టర్‌కు పంపుతాం. కలెక్టర్ అప్రూవ్ చేసిన వెంటనే సదరు కంపెనీ పనులు మొదలు పెడుతుంది.

ప్రశ్న: గరిష్టంగా రైతుకు ఎంత సబ్సిడీ వస్తుంది?

చిన్న రైతుకు గరిష్టంగా రెండు లక్షల 18 వేల 180 రూపాయలు, పెద్ద రైతుకు గరిష్టంగా మూడు లక్షల పదివేల రూపాయలు సబ్సిడీ ఉంటుంది.

ప్రశ్న: సూక్ష్మ సేద్య పరికరాలు బిగించిన తర్వాత రైతులకు ఏమైనా సూచనలు, సలహాలు ఇస్తారా?

సూక్ష్మసేద్యం ద్వారా నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు ఇరిగేషన్ షెడ్యూల్ ఇస్తాం. ఆ షెడ్యూల్ ప్రకారమే రైతు సూక్ష్మ సేద్యాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది.

ప్రశ్న: చివరిగా రైతులకు మీరిచ్చే సలహా ఏమిటి?

ప్రతి రైతూ సూక్ష్మ సేద్య పథకాన్ని ఉపయోగించడం ద్వారా నీటిని ఆదా చేయడమే కాకుండా నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చు. భావితరాల వారికి నీటిని అందించవచ్చు. అంతేకాక నీళ్లలో కరిగే ఎరువులు వాడటం ద్వారా ఎరువుల వాడకాన్ని బాగా తగ్గించవచ్చు. కాబట్టి ప్రతి రైతు సూక్ష్మ సేద్యం దిశగా అడుగులు వేయాలని కోరుతున్నాను.



పంటలను పరిశీలిస్తున్న హేమ


దెబ్బతిన్న పంటల పరిశీలన

ముసునూరు: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న అరటి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న పంటలను ఉద్యాన శాఖాధికారి హేమ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలను వర్షం నుండి ఎలా కాపాడుకోవాలనేది వివరించారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరం సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని పూళ్ల గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్ కోరారు. ఆదివారం పూళ్ల శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన ఆమె వేసవి విజ్ఞాన శిబిరం వాల్‌పోస్టర్‌ను గ్రంథ పాలకులు డిఎన్‌బి.అమర్నాథ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం తరగతులకు విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయులు రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించేందుకు ముందుకొచ్చారన్నారు. గ్రంథాలయంలో 15 వేల పుస్తకాలు అందుబాటులో ఉండగా బాలల సాహిత్యానికి చెందిన 2500 పుస్తకాలు విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఉన్నత తరగతులు చదివే విద్యార్థుల కోసం 2000 వరకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ఆన్‌లైన్ కంప్యూటర్ సేవలు అందుబాటులో ఉంచామన్నారు. శిబిరంలో చిత్రలేఖన శిక్షణ, పోటీల కోసం ప్రత్యేక బోర్డులను సిద్ధం చేశామన్నారు. భీమడోలు శాఖ గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త మండే సుధాకర్ ఆధ్వర్యం లో విద్యార్థులు భీమడోలు పురవీధుల్లో వేసవి విజ్ఞాన శిబిరం సేవలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు గ్రామ సర్పంచి కె.లక్ష్మి, గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచి

ఉపాధి హామీకి నిధుల కోత దారుణం

పరిరక్షణ యాత్రలో నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌లో కోతలు దారుణమని, తక్షణం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిర్వీర్య విధానాలు మానుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ అన్నారు. ఆదివారం ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర మండలంలోని ముసునూరు, చింతలవల్లి, చక్కపల్లి, గుడిపాడు, వలసపల్లి, లోపూడి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల మీదుగా సాగింది. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి మురళీ, శిలారపు రాజశేఖర్, కంచర్ల శ్రీను, ఆంజనేయులు లక్కపాము వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రామకృష్ణ

అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలి

వర్థంతి కార్యక్రమాల్లో నేతలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అల్లూరి ఆశయాల సాధనే ఆయనకు అర్పించే ఘన నివాళులని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు అన్నారు ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్థంతి సభ నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి నేలటూరి నిర్మల, సిపిఎం నేతలు ఎన్‌వి.అప్పారావు, సిరిబత్తుల సీతారామయ్య, సుందరయ్య కాలనీ నాయకులు నల్ల భీమశంకరం, భగత్‌సింగ్ కాలనీ ప్రెసిడెంట్ వాసా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



టి.నర్సాపురంలో..

టి.నరసాపురం : తెల్లదొరలను దేశం నుండి తరిమికొట్టిన మన్యం విప్లవ వీరుడు సీతారామరాజు అని ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అనుమోలు మురళి, మడకం కుమారి అన్నారు. అల్లూరి వర్థంతి సందర్భంగా ఆదివారం మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అనుమోలు బరగడ కుమారి, చెల్లమ్మ, లక్ష్మీ, నాగ సర్వేశ్వరావు పాల్గొన్నారు.


నిడమర్రు: భువనపల్లిలో సిపిఎం, సిఐటియు ఆధ్వర్యాన మూడు రోడ్ల సెంటర్లో. అల్లూరి సీతారామరాజు వర్థంతి ఘనంగా నిర్వహించారు. కోన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గవర సత్యనారాయణ, లింగ బారి లక్ష్మణరావు, వెలగలేటి మోహన్, బాపిరాజు, పిల్ల సూరిబాబు, సంకు బాలకృష్ణ, ధారబోయిన గాంధీ, సంకు మురళీ, పిల్లా కృష్ణ పాల్గొన్నారు.

పూళ్ల అభివృద్ధికి చర్యలు

ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని పూళ్ల గ్రామాభివృద్ధి కోసం చర్యలు తీసుకున్నట్లు ఆ సంస్థ ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం తెలిపారు. గ్రామం మధ్యలో నిరుపయోగంగా ఉన్న పురాతన బావి చెరువు అభివృద్ధికి ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు సిఫార్సు మేరకు ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ రూ.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో చెరువును అభివృద్ధి చేయడం, చెరువు గట్లను రన్నింగ్ ట్రాక్‌గా మార్పు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. చెరువుగట్లకు రివిట్‌మెంట్ చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీనికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.ఐదు లక్షలు మంజూరు చేయగా స్థానిక దాత రూ.ఐదు లక్షలు అందజేసేందుకు ముందుకొచ్చారు. దీంతో రన్నింగ్ ట్రాక్, పార్కు పనులకు మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం ఆదివారం శంకుస్థాపన చేశారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ వైస్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్ పార్కు నిర్మాణ నమూనా గురించి ఎంఎల్‌ఎ, ఎంపీకి వివరించారు. పురాతన బావి చెరువు వినియోగంలోకి రావడంతోపాటు జల క్రీడలు ఆడుకునే అవకాశం ఉందన్నారు. పర్యాటక శాఖ సహకారంతో చెరువులో బోట్ విహారం సౌకర్యం ఏర్పాటుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు (రాజీలు), గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి తుమ్మగుంట భవానిరంగా, వైసిపి ప్రముఖులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎంఎల్‌ఎ

కలిదిండిలో కర్ఫ్యూ వాతావరణం

ప్రజాశక్తి - కలిదిండి

మధ్యాహ్నం 12 గంటల నుంచి కలిదిండి ప్రధాన సెంటర్‌లో కర్ఫ్యూ వాతావరణం నెల కొంటోంది. దుకాణ దారులు బేరాలు లేక షాపుల మూసివేతకే సిద్ధపడుతున్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో ఒక్కసారిగా వర్షం కురవడం లేదా అధిక ఎండలు చోటు చేసుకుంటున్నాయి. గత రెండు రోజులుగా అధికంగా భానుడి ప్రతాపం చూపడంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వాతావరణం చల్లబడే వరకు అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి జనం బయటకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యాపారాలు లేక ప్రధాన సెంటర్ లోని దుకాణాలు మూతబడడంతో రాష్ట్రీయ రహదారి నిర్మానుష్యంగా మారింది.



కలిదిండి ప్రధాన సెంటర్‌లో నిర్మానుష్యంగా రహదారి

అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని లంకపాకలలో, పందిరి మామిడిగూడెం గ్రామాల్లో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, ప్రజా సంఘాలు ప్రగతిశీల యువజన సంఘం, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల మహిళా సంఘం, భారత కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ నాయకులు కారం రాఘవ, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.భూషణ్ మాట్లాడారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఏజెన్సీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, రాష్ట్రంలో రోడ్ల నిర్మాణం, ఎత్తైన బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో తగరం బాబురావు, ఎస్.రామ్మోహన్, అలివేరు సర్పంచి కారం లక్ష్మి, అంతర్వేదిగూడెం ఎంపిటిసి సభ్యులు కె.గోవిందరాజులు, నాయకులు, కంతం నాగేశ్వరావు, వినోద్‌రాజు, విశ్వనాథం పాల్గొన్నారు.

ముదినేపల్లి : అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహనికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని కొర్రగుంటపాలెం పంచాయతీ శివారు రాజనగరంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహనికి కైకలూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు దావు నాగరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బ్యాంక్ మాజీ అధ్యక్షులు సూర్యనారాయణరాజు, పార్టీ నేతలు బోయిన ఫణికుమార్, శీలం సురేష్, దాసరి శ్రీను, శివ పాల్గొన్నారు.



అన్నసమారాధనలో ప్రజలు

గుండుగొలనులో అన్నసమారాధన

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలనులోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం గుండుగొలను ఒక ప్రయివేట్ కల్యాణ మండపంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు వేల మందికి పైగా అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివివి.భాస్కర్, మావుళ్లపల్లి కాశీబాబు, వగ్వాల రామన్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితునికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి వైద్య ఖర్చుల నిమిత్తం టిడిపి యువనేత కొడాలి వినోద్ ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ముదినేపల్లి అంబేద్కర్ కాలనీకి చెందిన భలే చంద్రశేఖర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం పార్టీ టిడిపి నేతల ద్వారా తెలుసుకున్న కొడాలి వినోద్ ఆదివారం ఇంటికి వెళ్లి చంద్రశేఖర్‌ను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. వినోద్‌తో పాటు వార్డు సభ్యులు మదిరి పార్థసారథి, పంతగాని సురేష్, గ్రామస్తులు ఉన్నారు.

ఆలయానికి హుండీ బహూకరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చినపాలపర్రులో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామివారి ఆలయానికి మండలంలోని పెయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీకి చెందిన మొవ్వ సత్యవతి కుమారులు ఫణీంద్ర, మధు హుండీని బహూకరించారు. ఆదివారం గ్రామంలో జరిగిన నూతన ఆలయ ప్రతిష్ట సందర్భంగా హుండీని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

నేరాలు - ఘోరాలు

బాల్య వివాహం చేసిన వారిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

14 ఏళ్ల బాలికకు పెళ్లి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల ఐదో తేదీన టి.నరసాపురం గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలికకు ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం మండలానికి చెందిన 19 ఏళ్ల యువకునితో వివాహం జరిపించారని తహశీల్దార్ జెవి.సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక తల్లిదండ్రులు, యువకుడు అతని తల్లిదండ్రులు, పెద్దలపై బాల్య వివాహ చట్టం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని నూగొండపల్లి సిఆర్‌పిఎఫ్ అవుట్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తూ కనబడకుండా పోయిన తూర్పుగోదావరి జిల్లా అల్లవరానికి చెందిన సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ బోరా శ్రీనివాస్ అచూకీ లభ్యమైంది. ఆయన ఆచూకీ కోసం ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు ప్రత్యేక బృందాలును ఏర్పాటు చేశారు. దీంతో పాటు బంధువుల సహాయంతో గన్నవరంలోని ఒక హోటల్ రూంలో అనారోగ్యంతో విశ్రాంతి తీసుకొంటున్న కానిస్టేబుల్‌ను కనుగొని, అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి భార్య, బంధువులకు అప్పగించారు.

'పది' ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముదినేపల్లి



మండలంలో ఎనిమిది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు పది ఫలితాల్లో 42 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలోని పెదపాలపర్రు జెడ్‌పి హై స్కూల్ 50 శాతం, పెదగొన్నూరు హైస్కూల్ 75 శాతం, వడాలి జెడ్‌పి హైస్కూల్ 45 శాతం, ముదినేపల్లి హైస్కూల్ 42 శాతం, బొమ్మినంపాడు హైస్కూల్ 36 శాతం, అల్లూరు హైస్కూల్ 33 శాతం, గురజ హైస్కూల్ 26 శాతం, మండలంలో అత్యల్పంగా చిరురుకోట హైస్కూల్ 12 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మండలంలోని ఏడు ప్రయివేటు పాఠశాలలు 96 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 582 మార్కులతో ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి పామర్తి వివేక్ మండలంలో ప్రథమస్థానం సాధించగా, మండలంలోని పెదగొన్నూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి పి.చార్లెస్‌ఫిన్ని 568 మార్కులతో ద్వితీయ స్థానం, చిరుగుకోట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని గంగుల ఇందుశ్రీ 546 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు మొత్తం కలిపి 61 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ రామారావు తెలిపారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

మండవల్లిలో 51 శాతం ఉత్తీర్ణత



మండవల్లి : పదో తరగతి పరీక్షల్లో మండలంలో 51 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఇఒ కె.నరేష్‌కుమార్ తెలిపారు. చింతపండు, లోకుమూడి, మండవల్లి, లింగాల, కానుకొల్లు, పుట్లచెరువు, ఇంగిలంపాకలంక ఏడు పాఠశాలలకు చెందిన 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాక 173 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి యువసాయినాగేంద్ర ప్రదీప్ 585 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానం, కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మౌనిక 582 మార్కులతో ద్వితీయ స్థానం, లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంఎల్ఎన్.సురేంద్రనాయుడు 560 మార్కులతో తృతీయ స్థానం సాధించారని తెలిపారు. ముగ్గురు విద్యార్థులను పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్లు, తల్లిదండ్రులు అభినందించారు.

సమాన మార్కులతో ఇద్దరు ప్రథమం

ప్రజాశక్తి - ముదినేపల్లి



పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఒకే మార్కుతో ఉతీర్ణులయ్యారు. స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు కంచర్ల సూర్యకౌశిక్ (586), జి.రవికిరణ్(586) ఒకే మార్కుతో ఉత్తీర్ణత సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈడేపల్లికి చెందిన కీర్తన 570 మార్కులతో ద్వితీయ స్థానం, పెయ్యేరుకు చెందిన డి.ధోనిశంకర్ తృతీయస్థానం సాధించారు. ఈ విద్యార్థులను స్కూల్ ప్రిన్సిపల్ బి.రఘురామయ్య, వైస్ ప్రిన్సిపల్ బలుసు సాయిసుమిత్ అభినందించారు.

ప్రయివేట్ పాఠశాలల విజయ ఢంకా

ప్రజాశక్తి - ముసునూరు



మండలంలోని చెక్కపల్లి గ్రామంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న తమ పాఠశాల విద్యార్థులు 95 శాతం విజయం సాధించి ప్రతిభ కనపర్చారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరీదు నాగరాజు తెలిపారు. ఎం.లావణ్య 569 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ముసునూరు గురుకుల పాఠశాల విద్యార్థులు 96 శాతం విజయం సాధించి ప్రతిభ కనపర్చారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యార్లగడ్డ శ్రీదేవి తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన కె.భార్గవి 581తో ప్రథమ స్థానంలో, జె.సంధ్య 576 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ముసునూరు భారతీయ విద్యానికేతన్ పాఠశాల 89 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కొండేటి శౌరి తెలిపారు. గుడివాడ సిరి 535 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచిందని తెలిపారు.

కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - కలిదిండి



స్థానిక కలిదిండి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విజయ ప్రభంజనం కొనసాగించారని కరస్పాండెంట్ సానా మీనా సరస్వతి తెలిపారు. ఆనంద్ కుమార్ 583 మార్కులు, కె.ఈశ్వరి కీర్తి 572, డి.పల్లవి 553, బి.ప్రమీల 539, అనుటొమ్ 509 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. 500 పైగా మార్కులు 12 మంది విద్యార్థులు సాధించగా, మరో ఐదుగురు విద్యార్థులు 450 పైగా మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బందిని కరస్పాండెంట్ సానా మీనా సరస్వతి అభినందించారు.

'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ



ముదినేపల్లి : మండలంలోని కొత్తపల్లి ప్రగతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.పార్థసారథి ఆదివారం తెలిపారు. మొత్తం 54 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వీరిలో 52 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో 26 మంది విద్యార్థులు 500 మార్కులు పైబడి సాధించారన్నారు. 583 మార్కులతో కొండవీటి లాస్యశ్రీ మండలస్థాయిలో ప్రయివేటు స్కూళ్లల్లో ద్వితీయస్థానంలో నిలిచినట్లు చెప్పారు. 582 మార్కులతో ఊసల శరణ్య, 579 మార్కులతో మైలు మనోహరదుర్గాప్రసాద్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ముందు వరసలో నిలిచారన్నారు. పది ఫలితాల్లో తమ పాఠశాల 96.3 శాతం ఉత్తీర్ణత సాధించిదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ప్రిన్సిపల్ పార్థసారథి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పది ఫలితాల్లో విద్యావికాస్ ప్రభంజనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక విద్యవికాస్ విద్యాసంస్థల విద్యార్థులు 593 మార్కులు సాధించి విజయప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యావికాస్ విద్యార్థులు మద్రవాడ వేణిసాయి సత్యలక్ష్మి 593, ఎస్.గీతాంజలి 592, జి.లిఖిత్ 590, చౌదరి 589, కెవిఎస్.కార్తీక్ 588, కె.అభిరామ్ సాయి, ఎన్.కెవిన్, కె.సుబ్రహ్మణ్యం, బేబీ అనుశ్రీ, వై.అమృత 585, .జి.లహరి 584, నితిశ్ అర్జున్, 584, నితిశ్ కృతి 583 మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించాలని తెలిపారు. పది పరీక్షల ఫలితాల్లో విజయం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

గోనె సంచులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం సరఫరా కోసం రైతులకు గోనె సంచులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల స్థాయి పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం వెజ్జు శ్రీరామమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన లింగరాజు మాట్లాడుతూ గోనె సంచుల సరఫరాలో విఫలమైన ప్రభుత్వం రవాణా కోసం లారీలు సమకూర్చే విషయంలో సైతం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. రైతుల సేవ కోసం ప్రత్యేకించిన రైతు భరోసా కేంద్రాలు రైతుల ప్రయోజనాలకు అనువుగా వ్యవహరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల ఇబ్బందులపై స్పందించి అవసరమైన సంఖ్యలో గోనె సంచులను సరఫరా చేయాలని, రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అకాల వర్షానికి పంట నష్టపోయిన కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రముఖుల మానుకొండ వీర్రాజు, కట్టా భాస్కర రావు పాల్గొన్నారు.

అక్రమ చెరువులు పరిశీలించిన జిల్లా అధికారి

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా, అక్రమంగా తవ్విన ఆక్వా చెరువులను జిల్లా మత్స్యశాఖ అధికారి పరిశీలించారు. మండలంలోని దేవపూడిలో గతంలో అనుమతులు లేకుండా దేవపూడికి చెందిన పలువురు వ్యక్తులు అక్రమ చెరువులు తవ్వారు. దీంతో గ్రామంలో పంట కాల్వలు, పంట చేలు పాడైపోవడంతో పాటు పంటకాల్వలు, మంచినీటి చెరువులు కలుషితమవుతాయంటూ దేవపూడి గ్రామ సిపిఎం సీనియర్ నాయకులు ఉల్లంకి నాంచారయ్య అనుమతులు లేకుండా చెరువులు తవ్వే వ్యక్తులను హెచ్చరించారు. దీంతో సదరు వ్యక్తులు నాంచారయ్యను పలు విధాలుగా ఇబ్బందులు పెట్టసాగారు. నాంచారయ్యపై కక్ష సాధింపు చర్యలు చేపట్టారు. దీనిపై ఈ నెల నాలుగో తేదీ గురువారం ప్రజాశక్తిలో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ దేవపూడిలో పర్యటించి అనుమతులు లేకుండా తవ్విన చెరువులను నాంచారయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అక్రమంగా తవ్విన చెరువులను కొట్టి వేస్తామన్నారు. ఎవరైన అనుమతులు లేకుండా చెరువులు తవ్వితే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు పొంది చెరువుల తవ్వకాలు చేపట్టాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైన తవ్వకాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులు లేకుండా చెరువు తవ్వకాలు చేపట్టిన ఉల్లంకి నరేష్, పాలడుగు సురేంద్రలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. ఆయనతో పాటు మండల మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి వి.సతీష్‌కుమార్ ఉన్నారు.



అక్రమ చెరువులను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి నాయకులు కోరారు. మండలంలోని పేరంపేట, పంగిడిగూడెం గ్రామాల్లో టిడిపి మండల అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని, మొక్కజొన్న పంటలను టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దాసరి శేషు, సత్యనారాయణలు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని, తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని కోరారు. రైతులకు పంటనష్టం చెల్లించకపోతే రైతులతో కలిసి తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. నేడు అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతుల నుంచి లోడింగ్, అన్‌లోడ్ కూడా ముందే డబ్బులు వసూలు చేసే దౌర్భాగ్యం ఏర్పడిందని ప్రభుత్వాన్ని విమర్శించారు. కనీసం సంచులు కూడా సకాలంలో అందించకలేకపోవడం అత్యంత అవమానకర పరిస్థితని అన్నారు. ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కమిటీ నాయకులు, కార్యకర్తలు, రైతులు రామ్ ప్రసాద్, పడాల చిన నాగేశ్వరరావు, పోక వీర రాఘవులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పది రోజుల నుంచి జిల్లాలో అకాల వర్షాలు పడుతున్నాయని, దీంతో జిల్లాలో వరి, మొక్కజొన్న, మిర్చి, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.25 వేలకు పైగా ఖర్చు చేసిన రైతులకు కౌలు అధిక భారం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో గోనె సంచులు సరఫరా లేని కారణంగా దీన్ని అవకాశంగా తీసుకున్న మిల్లు యజమానులు ధాన్యం కొనుగోలులో రైతుల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తడిచిన, మొలకెత్తిన, నూకగా మారిన ధాన్యాన్ని ఎటువంటి ఆంక్షలు లేకుండా కనీసం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. లేకపోతే సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నష్టపోయిన రైతాంగానికి న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తామని తెలిపారు.




జంగారెడ్డిగూడెంలో తడిసిన మొక్కజొన్న పరిశీలిస్తున్న టిడిపి నేతలు

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్ ఆవరణలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. తపన ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బిజెపి కార్యవర్గ సభ్యురాలు వెంకటలక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయన్నారు. వేసవి కాలంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు గురి కాకుండా ఉండేందుకు ఇటువంటి క్రీడలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఇలాంటి సంస్థలు ముందుకు వచ్చి పోటీలు ఏర్పాటు చేయటం ఆనందదాయకమన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది యువత ఉన్నతమైన స్థితిలో ఉన్నారన్నారు. అటువంటివారిని ఆదర్శంగా తీసుకుని యువత క్రీడలపై ఆసక్తి కనపరచాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో 20 జట్లు తలపడనున్నాయని, గెలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు ప్రకటించారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ గిరిటి చక్రి, తుంపెల్లి వీరబాబు, మీసాల అంజిబాబు, గిరిటి సాయికిరణ్ ధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.



విరాళం అందిస్తున్న దాత

నిత్యాన్నదాన ట్రస్టుకు దాత విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఆదివారం దాత విరాళం అందించారు. మండలంలోని వడాలికి చెందిన వీరమల్లు వీరవెంకటసత్యనారాయణ, రత్నకుమారి దంపతులు స్వామివారి సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ25,116 విరాళం ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజుకు అందించారు.